క్లుప్తంగా

నేడు హోం మంత్రి పర్యటన ఇలా...

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం ఉదయం 9.45 గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించే డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం కొవ్వూరు మెయిన్ రోడ్డు, మెరక వీధి మూడో వార్డు పరిధిలో నిర్వహించే జయంతి వేడుకల్లో కూడా ఆమె పాల్గొంటారు. 10.45 గంటలకు ఐ.పంగిడి గ్రామంలో దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించే పురోహితుల క్రికెట్ టోర్నమెంటును మంత్రి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇక్కడ నుంచి బయలుదేరి వెళతారు.

ఆలయాల్లో విశేష పూజలు

చాగల్లు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తెలగా సంఘం వినాయకుడి గుడి ఆవరణలో మంగళవారం మైలవరపు ఆదివిష్ణు దంపతులచే స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 9న గంగ్రోతు కృష్ణారావు ఆడిటోరియం వద్ద అన్న సమారాధన చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గంగ్రోతు సురేంద్రకుమార్, జుట్టా కొండలరావు తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా చాగల్లు రజకుల చెరువు వద్ద గల రామాలయంలో మంగళవారం అన్నసమారాధన జరిగింది.

ఆశాలు అంకితభావంతో పనిచేయాలి



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

గోపాలపురం: ఆశావర్కర్లు అంకితభావంతో పనిచేసి ఆసుపత్రికి గుర్తింపు తీసుకు రావాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త ఎం.సనత్ కుమారి సూచించారు. మండలంలోని ఆశా వర్కర్లతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేలా ప్రోత్సహించినట్లు గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఆశా వర్కర్ తన పరిధిలోని ఉన్న గర్భిణులను ప్రభుత్వాసుపత్రికి తరలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సమీప అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలతో సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు ఎం.శోభారాణి, కరిష్మా బేగం, చైతన్యరాజు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయ నివారణలో ఆశాలది కీలకపాత్ర



జిల్లాస్థాయి బెస్ట్ డాట్ ప్రొవైడర్ నాగమణికి ప్రశంసాపత్రం అందిస్తున్న డాక్టర్ రాజనాల

ఉండ్రాజవరం: క్షయ వ్యాధి నివారణలో ఆశా కార్యకర్తల ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుందని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ అన్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో జిల్లాస్థాయి బెస్ట్ డాట్ ప్రొవైడర్‌గా బి.నాగమణి, ధనలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రసాద్, క్షయ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి చేతుల మీదుగా వారిద్దరికీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్ ఏ.చిరంజీవి, పీహెచ్ఎన్ కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుజన చైతన్య పర్యటన విజయవంతం చేయాలి

ఉండ్రాజవరం: రెండు తెలుగు రాష్ట్రాల్లో చేపట్టే దళిత బహుజన చైతన్య పర్యటనను విజయవంతం చేయాలని పూలే అంబేడ్కర్ బహుజన మహాసభ వ్యవస్థాపకుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. మోర్త గ్రామంలోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఈ పర్యటన కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. దళిత బహుజనులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా, వారికి రాజ్యాధికారం కావాలని కోరుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బహుజన చైతన్య యాత్ర కొనసాగుతుందన్నారు.

సారా కేసుల్లో పాత నిందితుల బైండోవర్

దేవరపల్లి: సారా కేసుల్లో పది మంది పాత నిందితులను సత్‌ప్రవర్తన కోసం స్థానిక తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ దిమ్మల సుధ తెలిపారు. ఏడాదికి రూ.లక్ష షూరిటీతో సెక్షన్ 109 ప్రకారం బైండోవర్ చేసినట్టు ఆమె చెప్పారు.

చెట్టు నరికివేతపై ఫిర్యాదు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామ బస్టాండ్ సమీప గ్రామ కంఠంలోని రావి చెట్టును నరికి అక్రమంగా ట్రాక్టర్‌పై తరలించుకుని పోయారని దొమ్మేరు పంచాయతీ సర్పంచ్ తానేటి కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు.

దాహార్తికి చెక్..

- రూ.16 కోట్ల వ్యయంతో 125 కిలో మీటర్ల పైపులైన్లు
- మండలంలో మూడు చోట్ల వాటర్ ట్యాంకుల నిర్మాణం

నల్లజర్ల: ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజావసరాల మేరకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందుకనుగుణంగా గ్రామీణ నీటి సరఫరా శాఖ సన్నద్ధం అవుతోంది. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించారు. మరోపక్క జలజీవన్ మిషన్‌లో భాగంగా గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో రూ.16 కోట్ల వ్యయంతో దాదాపు 125 కిలోమీటర్ల పొడవైన తాగునీటి పైపులైన్లు వేసే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మండలాల వారీగా దేవరపల్లిలోని 16 గ్రామాలు, నల్లజర్లలోని 15 గ్రామాలు, గోపాలపురంలోని 14 గ్రామాల పరిధిలో ఈపైపులైన్లు వేస్తారు. ఇందుకోసం కాంట్రాక్టర్ వై.రామాంజనేయులు ఆధ్వర్యంలో భగీరథ కంపెనీకి చెందిన పైపులు నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయానికి ఇప్పటికే చేరాయి. **నల్లజర్లలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత** మంచినీటి ట్యాంకు, ముసుళ్లగుంట, ఆవపాడులలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ట్యాంకుల నుంచి తాగునీటిని కుళాయిల ద్వారా ప్రజలకు అందించేందుకు నల్లజర్ల మండలంలో 54 కిలోమీటర్ల పొడవైన పైపులైన్లు వేయనున్నారు. అలాగే దేవరపల్లిలో 1.50 లక్షల తాగునీటి సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ నిర్మించనున్నారు. ఇంతవరకూ తాగునీటి కుళాయి వేయించుకోనివారికి జలజీవన్ మిషన్‌లో ఉచితంగా ట్యాప్‌లు అందించనున్నారు. పైపులైన్ మార్చినపుడు ఆ ప్రాంతంలో గతంలో కుళాయి కనెక్షన్ ఉన్న వారు ఇప్పుడు తమ సొంత ఖర్చులతో మళ్లీ కుళాయి కనెక్షన్ తీసుకోవాలి. గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం నల్లజర్ల మండలంలో దాదాపు మూడు వేల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. మూడు మండలాల్లోనూ ఈ పనులన్నీ ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారంలోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తారు. వెను వెంటనే కుళాయిల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పైపులు

మిగతా గ్రామాలకు త్వరలో అంచనాలు



మొదటి దశలో వేసిన అంచనాల ప్రకారం ఇపుడు పనులు చేపట్టాం. మిగతా గ్రామాల్లో త్వరలో ఎక్కడెక్కడ పైపులైన్లు వేయాలన్నది గుర్తించి అక్కడ కూడా పైపులైన్లు వేసే పనులు చేపడతాం. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఏప్రాంతంలోను దాహార్తి నెలకొనే పరిస్థితి రాకుండా చూస్తాం. గ్రామాల్లోని మూగ జీవాలకు సైతం తాగునీరు అందించేందుకు నీటి టబ్‌లు ఏర్పాటు చేయనున్నాం.

– అజయ్‌బాబు, ఏఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, నల్లజర్ల

తపస్వీరెడ్డి నిడదవోలుకు గర్వకారణం



నిడదవోలులో తపస్వీరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: జాతీయస్థాయి ప్రతిభా పోటీల్లో రాణిస్తున్న కుంచాల తపస్వీరెడ్డి విజయాలు నిడదవోలుకు గర్వకారణమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు నారాయణ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్న తపస్వీరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాటర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఇండియా) జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో 15వ ర్యాంక్ సాధించి గోల్డెన్ గ్రీన్ సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తనను కలిసిన తపస్వీరెడ్డిని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

జగనన్న అంటే ఒక నమ్మకం



కొవ్వూరులో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న హోం మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్



నిడదవోలులో లబ్ధిదారులకు వైఎస్సార్ నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నిడదవోలు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు హాజరైన డ్వాక్రా మహిళలు

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- పొదుపు సంఘాలకు ఆసరా నమూనా చెక్కు అందజేత
- పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

కొవ్వూరు: ముఖ్యమంత్రి జగనన్న అంటే ఒక నమ్మకమని, మాటిస్తే నెరవేరుస్తారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కొవ్వూరు పట్టణ స్థాయి రుణమాఫీ నమూనా చెక్కును పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు. పట్టణంలోని లిటరరీ క్లబ్ కన్వెన్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి వనిత, రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి వనిత మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో ఆసరా పథకం ద్వారా రుణమాఫీ సొమ్ములను వారి ఖాతాలకు జమ చేశారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడం ద్వారా ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని జగన్ నిలబెట్టుకున్నారన్నారు. విద్యాశాఖలో ఇప్పటికే వినూత్న మార్పులు తీసుకొచ్చారన్నారు. ఒక మేనమామ, ఇంటి పెద్దలా మన బిడ్డలకు మంచి భవిష్యత్తు అందించేందుకు తపన పడుతున్నారన్నారు. టీడీపీ మాదిరిగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం లేదన్నారు. అన్ని వర్గాలకూ మేలు చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని రానున్న రోజుల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రిటర్న్ గిఫ్ట ఇవ్వాలని మంత్రి కోరారు.

ఏకైక మహిళా హోం మంత్రి మన రాష్ట్రంలోనే..

ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ దేశంలో ఏకైక మహిళా హోం మంత్రి ఒక్క మన రాష్ట్రంలోనే ఉండడం మహిళలందరికీ గర్వ కారణం అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో కేవలం రెండు లక్షల మందికి టిడ్కో ఇళ్లు నిర్మిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మిస్తోందన్నారు. అనంతరం కొవ్వూరు పట్టణంలోని 541 పొదుపు సంఘాలకు రూ.10.41 కోట్ల నమూనా చెక్కును మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ నాయకులు బత్తి నాగరాజు, దేవగుప్తాపు లక్ష్మణరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి నాగరాజు, వరిగేటి సుధాకర్, నగళ్లపాటి శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

నిడదవోలు రూరల్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆసరా వారోత్సవాలు స్థానిక బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నియోజకవర్గంలోని 48,150 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు మూడో విడతగా ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ సొమ్ము రూ.46.32 కోట్లకు నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతోనే జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇళ్ల పట్టాలను మహిళలకే అందిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని మహిళలకు సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్ర పటానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పాలాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ నిడదవోలులో నిర్వహిస్తున్న మహిళా చేయూత మార్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని డ్వాక్రా మహిళలకే అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఏపీఎం బి.నాగరాజు, మండల సమాఖ్య కార్యదర్శి పి.ప్రభావతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గృహ సారథులే రథసారథులు కావాలి



కానూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గృహ సారథులే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రథ సారథులు కావాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సూచించారు. మండలంలోని కానూరు, ఖండవల్లి గ్రామాల్లో గృహ సారథులు, పార్టీ కన్వీనర్లతో మంగళవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, కానూరు పంచాయతీ సర్పంచ్ భావన మధు వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మిశెట్టి రాము, కరుటూరి గోపి, తోట సురేష్, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం



మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి తదితరులు

కొవ్వూరు: కొత్తగా ఎన్నికైన కొవ్వూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొబ్బా భారతి, ఇతర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను ఆమె క్యాంపు కార్యాలయలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తక్కెళ్ల చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీ మెరిపో గోపి, ఉపాధ్యక్షుడు కోమలి గోపాలకృష్ణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ యడాటి ప్రకాశరావు, లైబ్రరీ సెక్రటరీ టి.రవీందర్, మహిళా ప్రతినిధి వి.రాజేశ్వరీ, ట్రెజరర్ వి.రాజావరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఇమ్మణ్ని వీర శంకరం తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని యువరాజ్ మినీ ఫంక్షన్ హాల్లో సోమవారం రాత్రి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అభినందన సభ నిర్వహించారు. ప్రెసిడెంట్ బొబ్బా భారతిని, ఇతర కార్యవర్గ సభ్యులను ఈ సందర్భంగా పలువురు పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదల మేలు కోసమే సేవా కార్యక్రమాలు

- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్
- ఖండవల్లిలో లయన్స్ క్లబ్ జోన్ మీట్

పెరవలి: లయన్స్ క్లబ్‌లు వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించేది పేదల మేలు కోసమే అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. లయన్స్ క్లబ్ జోన్ సమావేశాన్ని మండలంలోని ఖండవల్లి సమీపంలోని రవళి స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఆ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ వంక రాజకుమారి మాట్లాడుతూ జోన్ పరిధిలో తేతలి, అత్తిలి, పైడిపర్రు, పెరవలి, పెనుగొండలలో లయన్స్ క్లబ్ శాఖలు విస్తరించి ఉన్నాయన్నారు. ఎక్కువ వైద్య శిబిరాలు నిర్వహించిన లయన్స్ క్లబ్ శాఖలను ఆమె అభినందించారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధ్యక్షులకు ఆమె అవార్డులు అందించారు. కార్యక్రమంలో చిన్నమిల్లి సత్యనారాయణ, వల్లూరిపల్లి మురళీమోహన్‌రావు, మాదిరెడ్డి బాబూజీరావు, శ్రీరామ్ సురేష్, గట్టి మాణిక్యాలరావు, పాపారావు నాయుడు, ఒంటిద్దు సోమసుందర్, గడుగొయ్యిల వివేకానంద స్వామి, కొత్తపల్లి రవికుమార్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ శాఖల అధ్యక్షులకు అవార్డులు అందిస్తున్న వంక రాజకుమారి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

'మా నమ్మకం నువ్వే జగనన్న' పై సదస్సులు

దేవరపల్లి: 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంపై ఈ నెల 7 నుంచి 14 వరకూ మండలంలో గ్రామాలవారీగా వైఎస్సార్ గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్నట్టు గృహ సారథుల మండల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్ తెలిపారు. మంగళవారం బందపురం, దుద్దుకూరు, గౌరీపట్నం, కురుకూరు గ్రామాల్లో ఈ సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. గృహసారథులు, కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు ఈ నెల 7 నుంచి ప్రతి గృహానికి వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, ఆ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌పై వారి అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ అంటించాలని సూచించారు. ఈ నెల 7న ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారభిస్తారని చెప్పారు. ఇప్పటి వరకు ఎనిమిది గ్రామాల్లో సదస్సులు నిర్వహించామని, మరో ఏడు గ్రామాల్లో నిర్వహించవలసి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో గృహ సారథులకు అవగాహన కల్పిస్తున్న పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్

సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం

కొవ్వూరు: గతేడాది జనవరిలో హత్యకు గురైన చాగల్లుకు చెందిన మాచవరపు సురేష్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఈ మొత్తానికి చెక్కును మంత్రి తానేటి వనిత మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబాన్ని ఆదుకునే నిమిత్తం వారి కుటుంబానికి ముఖ్యమంత్రి ఈ సాయం చేశారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కొవ్వూరు, చాగల్లు మండల శాఖల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, నాయకులు జుజ్జువరపు రామచంద్రరావు, గెల్లా రాజు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉండవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చెక్కు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

వాటిని ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలి

ఉండ్రాజవరం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆదాయ వనరులుగా తీర్చి దిద్దాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ జిల్లా కో–ఆర్డినేటర్ కె. శ్రీరామ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల పని పరిస్థితి, ప్రాథమిక పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పరిస్థితుల పరిశీలనకు ప్రభుత్వం జిల్లా కో–ఆర్డినేటర్‌గా శ్రీరామ్‌ను నియమించింది. ఆయన మంగళవారం మండలంలో వేలివెన్ను, చిలకపాడు, పసలపూడి, వెలగదుర్రు, వెలగదుర్రు గ్రామాల్లో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల వద్ద థియో రిజిస్టర్లతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పరిశీలించారు. సర్పంచులు సాగి పద్మావతి, తిరుమళ్ళ సూర్యకుమారి, అత్తిలి సత్యనారాయణ, కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు పాల్గొన్నారు.

నదిలోకి దూకిన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: గోదావరి నదిలోకి దూకి గల్లంతైన ఇంజవరపు సత్యనారాయణ (25) అనే యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని తుపాకులగూడెం ప్రాంతానికి చెందిన సత్యనారాయణ సోమవారం సాయంత్రం రోడ్డు కం రైల్ వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. వంతెన 110వ నంబర్ పిల్లర్ సమీపంలో గుర్తించిన అతడి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై తెలిపారు. పలుచోట్ల చేసిన అప్పులు తీరే మార్గం లేక పోవడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు. సత్యనారాయణ బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకడాన్ని అదే సమయంలో ఆర్టీసీ బస్సులో వస్తున్న అతడికి బావమరిది వరసైన రాజశేఖర్ గుర్తించాడు. అతడు బస్సు దిగి వెళ్లేసరికే సత్యనారాయణ నదిలోకి దూకేశాడు. మృతుడు సత్యనారాయణకు వివాహం కాలేదు. తల్లిదండ్రులతో పాటు వివాహితులైన ఇద్దరు అక్కలు న్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గా ప్రసాద్ తెలిపారు.



ఇంజవరపు సత్యనారాయణ మృతదేహం

నిడదవోలులో అన్న సమారాధన

నిడదవోలు రూరల్: శ్రీరామ నవమి ముగింపు వేడుకల్లో భాగంగా నిడదవోలు పట్టణంలోని యాదవుల వీధిలో మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సీతారామచంద్రస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు

నల్లజర్ల: తూర్పు గోదావరి జిల్లా ఆవిర్భావ వేడకలను నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అజయ్‌బాబు, ఉపాధి హామీ ఏపీఎం సత్యనారాయణ జిల్లా ఆవిర్భావంపై మాట్లాడారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

నల్లజర్లలో బాలిక అదృశ్యం

నల్లజర్ల: నల్లజర్లకు చెందిన 14 ఏళ్ల ఓ బాలిక సోమవారం ఉదయం నుంచీ అదృశ్యమైంది. దీనిపై ఆ బాలిక తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోనే ఉన్న తమ బంధువుల ఇంటికి వెళతానని చెప్పి వెళ్లిన బాలిక ఇంతవరకూ కనిపించకుండా పోయిందని తండ్రి వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.